క్లుప్తంగా

విద్యార్థినులకు అభినందనలు



అయిజ: ఈనెల 2న గద్వాల జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఈవెంట్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో సీఆర్‌టీలు అభినందించారు. ఈ సందర్భంగా కేజీబీవీ ఎస్‌ఓ చెన్న బసమ్మ మాట్లాడారు. జావిన్‌త్రో క్రీడలో అండర్ -17 విభాగంలో బీటీ హర్షిత మొదటి బహుమతి, జి.మహేశ్వరి ద్వితీయ బహుమతి గెలుపొందినట్లు తెలిపారు. తోటి విద్యార్థినులు వారిని స్ఫూర్తిగా తీసుకొని క్రీడల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ సీఆర్‌టీలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచులు ముందస్తు అరెస్ట్



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మాజీ సర్పంచులు చలో చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న సందర్భంగా తెల్లవారుజామున ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి, పోలీస్ సిబ్బంది వారిని ముందస్తు అరెస్ట్ చేశారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు లోకేశ్వర్ రెడ్డి, శేషన్ గౌడు, శివ రాములు, నాయకులు జనార్దన్‌రెడ్డి, భాస్కర్, తదితరులు ఉన్నారు.

రాజోళి: పెండింగ్ బిల్లులు చెల్లించాలని, తమ డిమాండ్ల సాధన కోసం మాజీ సర్పంచులు చేపట్టిన చలో హైదరాబాద్‌ను అడ్డుకొని పోలీసులు అరెస్ట్ చేశారు. ముందుస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

అయిజ: మండలంలోని గుడుదొడ్డి గ్రామ మాజీ సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు హనుమంతురెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

తల్లి చెంతకు చేరిన బాలిక

గట్టు: మండల కేంద్రానికి చెందిన 9 ఏళ్ల బాలిక నందిని కన్పించకుండా పోయి, సోమవారం ఇంటికి చేరింది. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి నందిని కన్పించకుండా పోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతూ ఆచూకీ కోసం గాలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం చిరిగిన బట్టలతో బాలిక ఇంటికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. తాను ఎక్కడికి వెళ్లింది మాత్రం బాలిక చెప్పలేక పోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎట్టకేలకు బాలిక ఇంటికి చేరడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ విషయం పోలీసులకు సమాచారం అందించారు.

మాజీ సర్పంచు మృతి



చింతామణి రామాచారి(ఫైల్)

గట్టు: గట్టు మాజీ సర్పంచు చింతామణి రామాచారి(85) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. గద్వాల్లో నివాసం ఉంటున్న చింతామణి రామాచారి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 1970లో గట్టు పంచాయతీకి చింతామణి రామాచారి సర్పంచుగా ఏకగ్రీవంగా ఎన్నికై పదేళ్లు పదవిలో కొనసాగారు. ఆయన హయాంలోనే గట్టుకు ఇంటింటికి నల్లా, విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు కుమార్తెలు ఉన్నారు. మాజీ సర్పంచు మృతికి మాజీ సర్పంచులు ధనలక్ష్మి, మోహన్‌గౌడు, యుగంధర్, రిటైర్డ్ ఎంఈఓ సత్యనారాయణ, రిటైర్డ్ హెడ్మాస్టర్ గోవిందప్పలు సంతాపం తెలిపారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

అయిజ: ఒక ఇంట్లో ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ విజయభాస్కర్ వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజ పట్టణంలోని ఇంట్లో సోమవారం కొందరు వ్యక్తులు క్రికెట్ మ్యాచ్‌కు సంబంధించి ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు సమాచారం వచ్చింది. జిల్లా ఎస్పీ టీ. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, అయిజ ఎస్‌ఐ విజయభాస్కర్, పోలీస్ సిబ్బంది ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్న ఐదుగురిని గుర్తించారు. వారి నుంచి రూ.1,04,860 నగదు, 5 మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. బెట్టింగ్‌కు పాల్పడిన అయిజ పట్టణానికి చెందిన వడ్ల కృష్ణ, చాకలి సతీష్ కుమార్, గుడికాటి నవదీప్, రాజోళికి చెందిన వెంకటేశ్, ఎండీ కరీంలను అరెస్ట్ చేశారు. వారిపై అయిజ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

కులగణన సమగ్రంగా నిర్వహించాలి

- 6వ తేదీ నుంచి సర్వే ప్రారంభం
- అధికారులకు, ఎన్యుమరేటర్లకు శిక్షణ తరగతులు



అలంపూర్‌లో శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనీలు

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కులగణన సర్వే సమగ్రంగా చేపట్టాలని మండల స్థాయి అధికారిణి పద్మావతి సూచించారు. అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కులగణన సర్వే నిర్వహించే ఎన్యుమరేటర్లకు సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా స్థాయిలో ట్రెనింగ్ పొందిన మాస్టర్ ట్రైనీలు ఏపీఓ రాజు, ఎంఏఓ నాగార్జున్‌రెడ్డి, ఉపాధ్యాయుడు వెంకట్ నాయుడులు శిక్షణ ఇచ్చారు. ఈ నెల 6 నుంచి 18వ తేదీ వరకు కుటుంబ సర్వే పూర్తి చేయాలని సూచించారు. 14 గ్రామ పంచాయతీలలో 5 మంది సూపర్‌వైజర్లు, 43 మంది ఎన్యుమరేటర్లు విధులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

- రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన సర్వేకు అందరు సహకరించాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు నరసింహ కోరారు. అలంపూర్ పట్టణంలోని టూరిజం హోటల్‌లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న కులగణన మండలంలోని అన్ని గ్రామా ల్లో ప్రారంభమవుతుందన్నారు. కులగణన కోసం గ్రా మాలకు వచ్చే అధికారులు, ఎన్యుమరేటర్లకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహకరించాలని విజ్ఞప్తి చేశా రు. కాంగ్రెస్ నాయకులు దేవరపోగు నరసింహ, బుచ్చన్న, రంజిత్ కుమార్, రాముడు ఉన్నారు.
- అయిజ మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీడీఓ వెంకటయ్య ఆధ్వర్యంలో సర్వేకు సంబంధించి శిక్షణ పొందిన టీచర్లు రవీంద్ర ధీర, బాలకృష్ణలు ఎస్జీటీ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఎస్జీటీ టీచర్లు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.
- వడ్డేపల్లి మున్సిపల్ కమిషనర్ రాజయ్య ఎన్యుమరేటర్లకు సూచించారు. వడ్డేపల్లి మున్సిపల్ కార్యాలయంలో సర్వేకు సంబంధించిన ఎన్యుమరేటర్ల సమావేశంలో మాట్లాడారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల అంశాలపై ప్రభుత్వం చేపట్టిన సర్వేను వడ్డేపల్లి, శాంతినగర్, పైపాడులోని పది వార్డుల్లో నిర్వహించాలని ఆదేశించారు. నవంబర్ 6 నుంచి 20 రోజుల్లోగా సర్వే పూర్తి చేయాలన్నారు. మొత్తం 75 ప్రశ్నలతో రూపొందించిన ఫార్మాట్‌లో సమగ్ర సమాచారం ప్రభుత్వం నిర్ణయించిన నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని కమిషనర్ సూ చించారు. మున్సిపాలిటీ పరిధిలోని 10 వార్డులకు సంబంధించిన ఎన్యుమరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.
- కేటిదొడ్డి మండల కేంద్రంలోని రైతువేదికలో సమగ్ర కుటుంబ సర్వేపై టీచర్లు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ కృష్ణమోహన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి తప్పులు లేకుండా సర్వే నిర్వహించాలన్నారు.
- రాజోళి మండల కేంద్రంలో సర్వే నిర్వహించే సిబ్బందికి ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చేసే సర్వే పక్కాగా, ప్రణాళికా బద్ధంగా ఉండాలని సూచించారు.
- ఎర్రవల్లి మండలంలోని కొండేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటిక్యాల తహసీల్దార్ నరేందర్ సూపర్‌వైజర్లకు, ఎన్యుమరేటర్లకు ఇంటింటి సర్వేపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్, ఆర్‌ఐ శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు, ఎన్యుమలేటర్లు ఉన్నారు.



శాంతినగర్‌లో ఎన్యుమరేటర్లకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజయ్య



అయిజలో మాట్లాడుతున్న రవీంద్ర



కేటీదొడ్డిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అతిఖుర్ రహ్మాన్

గద్వాల అర్బన్: మండల ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించాలని బీఆర్‌ఎస్ నాయకుడు అతిఖుర్ రహ్మాన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయ ఆవరణలో ఐకేపీ వీఓఏలు చేపడుతున్న సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. గ్రామ స్థాయిల్లో పని చేస్తున్న వీఓఏలకు గత ప్రభుత్వం ఇచ్చిన జీఓ ప్రకారం రూ.3వేలు అమలు చేయాలని, ప్రతి గ్రామ సంఘానికి ట్యాబ్, నెట్ సౌకర్యం కల్పించాలని, బకాయిగా ఉన్న స్త్రీనిధి ఇన్‌సెంటివ్‌ని గ్రామ సంఘాలకు ఇవ్వాలని, ప్రభుత్వం హామీ ప్రకారం రూ.20వేలు వేతనం చెల్లించాలని, రూ.20లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల వీఓఏలు ఉద్యోగులు తిమ్మన్న, తులసీ, బీసమ్మ, కవిత, సోమేశ్వరి, రేణుక, వనిత, ప్రియాంక, తదితరులు ఉన్నారు.

కుట్టుమిషన్ నేర్చుకుంటే స్వయం ఉపాధి



కుట్టు మిషన్ శిక్షణను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ మహేష్

గద్వాల అర్బన్: మహిళలు కుట్టు మిషన్ నేర్చుకుంటే ఉపాధి కలుగుతుందని కౌన్సిలర్ మహేష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ నగర్‌లో ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలు స్వయం ఉపాధి కోసం కుట్టుమిషన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఓఎంఐఎఫ్ ఫౌండేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ నారాయణ మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా అనేక మందికి కుట్టు మిషన్ శిక్షణ అందిస్తున్నామన్నారు. నాలుగు నెలల పాటు అందించే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గిరిబాబు. ఫౌండేషన్ మండల కో ఆర్డినేటర్ అనురాధ, సభ్యులు రేవతి, ప్రమీల, మౌనిక, గోవిందమ్మ, తదితరులు ఉన్నారు.

నీటి సరఫరా పునరుద్ధరణ



పైప్‌లైన్‌కు పూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ చిన్నదేవన్న, అధికారులు

అయిజ: మిషన్ భగీరథ కొత్త పైప్‌లైన్ పనులు పూర్తికావడంతో సోమవారం మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, ఏఈ రాజశేఖర్, కాంట్రాక్టర్ కరుణాకర్‌రెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించి తాగు నీటిని విడుదల చేశారు. పట్టణంలోని పెద్దవాగుపై గతేడాది పాత బ్రిడ్జిని తొలగించి కొత్త బ్రిడ్జిని నిర్మించడంతో మిషన్ భగీరథ పైపులను తొలగించారు. అప్పటి నుంచి మున్సిపాలిటీ పరిధిలోని మైలోని గడ్డ, కొత్త బస్టాండ్, బూరందొడ్డి కాలనీ, రాయచూర్ రోడ్డు చౌరస్తా, బుడగ జంగాల కాలనీలకు తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగింది. బ్రిడ్జి నిర్మాణం ఇటీవల పూర్తి కావడంతో కొత్త పైపులను అమర్చి ఆయా కాలనీల ప్రజలకు తాగునీటిని అందించే కార్యక్రమాన్ని అధికారులు పూర్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి



డీఈఈ ఇమ్మానియల్‌తో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

అయిజ: నెట్టెంపాడు ప్రాజెక్ట్ పనుల్లో భాగంగా మిగిలిపోయిన పనులను పూర్తి చేయకపోవడంతో రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు మేకల నాగిరెడ్డి అన్నారు. సోమవారం ఇరిగేషన్ డీఈఈ ఇమ్మానియల్ కాంగ్రెస్ నాయకులు కలిసి నాగర్‌దొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను, పంట కాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా మేకల నాగిరెడ్డి డీఈఈతో మాట్లాడారు. కాల్వ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, లైనింగ్ పనులు చేయలేదని, దానివల్ల కాల్వలు తెగిపోయి పంట పొలాల్లోకి నీటి ప్రవాహం వెళ్లడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడారు. నీటి విడుదలను నియంత్రించేందుకు సిబ్బంది కొరత ఉందని, పంట కాల్వలకు గేట్లు ఏర్పాటు చేయలేదన్నారు. నీటి ప్రవాహంను అరికట్టేందుకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆర్. శ్రీధర్, శేక్షావలి ఆచారి, రైతు సంఘం నాయకులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలి



విద్యార్థుల తల్లిదండ్రులకు నగదు బహుమతులు అందజేస్తున్న ట్రస్టు నిర్వాహకులు

మల్దకల్: ప్రభుత్వ పాఠశాలలో ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలని వెంకటేశ్వరమ్మ వెంకటేశ్వర్‌రెడ్డి ట్రస్టు నిర్వాహకులు సాగర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డిలు విద్యార్థులకు సూచించారు. సోమవారం మండలంలోని అమరవాయి జెడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి పాఠశాలకు, గ్రామానికి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. మండల స్థాయిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులు విజయకృష్ణ, భానుప్రియ, భారతి, మౌనిక, శివకుమార్‌లకు నగదు బహుమతులు అందజేశారు. నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న ట్రస్టు నిర్వాహకులను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు. మొత్తం విద్యార్థులతో పాటు పాఠశాల అభివృద్ధికి రూ.50వేలకు పైగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, హెచ్‌ఎం నరేష్, నరసింహస్వామి, రమేష్, రాజేశ్వర్‌రెడ్డి, ప్రసన్నకుమార్, నాగరాజు, విష్ణు, సుమలత, అనిత, రుషిరాజ్, ధనుంజయ, ఆనంద్, సరిత, అరుణ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు గేటు ఏర్పాటు



రాజోళి: మండల కేంద్రంలోని మండల పరిషత్ పాఠశాలకు దాతలు గేటును ఏర్పాటు చేశారు. గొల్ల సోమన్న ఆయన సోదరులు పాఠశాల ప్రహరీ ఏర్పాటు చేశారు. తమ తల్లిదండ్రులు చిన్నరాముడు, కేశమ్మల జ్ఞాపకార్థం గేటును ఏర్పాటు చేశామని, ఈ గేటు ద్వారా పాఠశాలకు భద్రత ఉంటుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది గజేందర్, సురేష్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నిషాక్, భీమన్న, శాంతయ్య, సాంబశివరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కళావేదిక నిర్మాణానికి రూ.1.5 లక్షలు విరాళం



గట్టు: తాను చదువుకున్న పాఠశాలలో కళావేదిక నిర్మాణం కోసం విదేశాల్లో ఉన్న ఎన్‌ఆర్‌ఐ రూ.1.5లక్షలు విరాళం అందజేసి ఉదారతను చాటుకున్నారు. బల్గెర గ్రామానికి చెందిన హనుమంతురెడ్డి కుమారుడు మాలి పటేల్‌సుధాక్ మాచర్ల ఉన్నత పాఠశాలలో 1992-93లో 10వ తరగతి చదివాడు. ప్రస్తుతం సింగపూర్‌లోని మీడియా రంగంలో స్థిర పడ్డాడు. మాచర్ల ఉన్నత పాఠశాలలో కళావేదికను నిర్మించేందుకు ముందుకొచ్చారు. దీంతో హెడ్మాస్టర్‌కు కళావేదిక నిర్మాణానికి అయ్యే ఖర్చు రూ.1.5 లక్షలు అందజేశారు. హెడ్మాస్టర్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు దాతను అభినందించారు.

సింగిల్‌విండో ద్వారా రైతులకు పంట రుణాలు



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా రైతులకు పంట రుణాలు అందిస్తామని సంఘం చైర్మన్ మురళీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం రుణాలకు సంబంధించిన చోచర్లను రైతులకు అందించిన ఆయన మాట్లాడుతూ సంఘం ద్వారా మండలంలోని పలు గ్రామాలకు చెందిన 25 మంది రైతులకు రూ.13.06 లక్షల కొత్త రుణాలు, 22 మందికి రైతులకు రూ.16.94 లక్షల పాత రుణాలు రెన్యూవల్ చేసిన వారికి ఇచ్చామన్నారు. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలని, తద్వార కొత్త రైతులకు రుణాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందని చెప్పారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ నవీన్‌కుమార్

గద్వాల రూరల్: బాల్య వివాహాలు నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బాలల పరిరక్షణ విభాగం చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ నవీన్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలో కాకులారంలోని ప్రభుత్వ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. బాల్య వివాహాల నిర్మూలన, సెల్‌ఫోన్ వల్ల వచ్చే అనర్థాలు, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలను వివరించారు. బాలలకు ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే 1098 లేదా డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ కౌన్సిలర్ జయన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌ప్రభ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.

సభ్యత్వ నమోదుతో బీజేపీ బలం పెరిగింది



గట్టులో సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి

గట్టు: బీజేపీ సభ్యత్వ నమోదుతో బలం పెరిగిందని, గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీకి మంచి ఆదరణ లభిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి తెలిపారు. పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదును సోమవారం గట్టులో ప్రారంభించారు. పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. సభ్యత్వ నమోదుకు జిల్లా కన్వీనర్ రాజశేఖర్ శర్మ హాజరయ్యారు. కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా జిల్లా కార్యదర్శి మోహన్‌చంద్ర, బీబీసీ జిల్లా కార్యదర్శి సురేష్, గట్టు మండల అధ్యక్షుడు నాగప్ప, నాయకులు వీరశేఖర్‌గౌడు, సంజీవనాయుడు, వెంకటేష్, నర్సింహులుగౌడు, రాఘవేంద్రాచారి, నాగప్ప, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ధరూరు: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా నాయకులు బలిగెర శివారెడ్డి ప్రారంభించారు. సాయంత్రం పార్టీ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు కుర్వ కిష్టన్న ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు శేఖర్‌రెడ్డి, ఆంజనేయులు, పాండు, ప్రకాష్, తిప్పన్న, నర్సింహులు, రాజు, గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మన్న పాల్గొన్నారు.

క్రీడలు, నృత్య ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న జెన్‌కో హెచ్‌ఎం యాదవరెడ్డి, ఉపాధ్యాయులు



రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ పోటీల్లో నృత్య ప్రదర్శన ఇస్తున్న జెన్‌కో విద్యార్థినులు

ధరూరు: మండలంలోని రేవులపల్లి పీజేపీ క్యాంపులోని జెన్‌కో డీఏవీ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఓ పక్క క్రీడలు, మరో పక్క సాంస్కృతిక కార్యక్రమాలు చురుగ్గా పాల్గొంటున్నారు. రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ పోటీలలో భాగంగా ఈ నెల 1,2వ తేదీల్లో హైదరాబాద్‌లోని సీసీఆర్‌టీ వేదికగా నిర్వహించిన పోటీలలో జెన్‌కో విద్యార్థులు ప్రతిభ చాటారు. గద్వాల జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ అథ్లెటిక్స్ పోటీలలో జెన్‌కో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల జెన్‌కో ఎస్‌ఈ సూరిబాబు, ప్రధానోపాధ్యాయులు యాదవరెడ్డి, పీటీటీ రవి, డీఏవీ సంస్థల ఆర్‌ఓ శేషాద్రినాయుడు, తదితరులు అభినందించారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి

ఏడీడీఎల్ పశువైద్యాధికారి డాక్టర్ కరుణ శ్రీ



సాతర్లలో పశువుల నుంచి సీరం సేకరిస్తున్న పశువైద్యాధికారులు

ఎర్రవల్లి: గాలి కుంటు వ్యాధి నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న టీకాలను ప్రతి పశువుకి తప్పకుండా వేయించాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం (ఏడీడీఎల్) అధికారి డాక్టర్ కరుణశ్రీ అన్నారు. సోమవారం ఇటిక్యాల మండలంలోని సాతర్ల గ్రామంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ భువనేశ్వరి ఆధ్వర్యంలో గాలి కుంటు వ్యాధి నివారణ, గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాన్ని ఆమె సందర్శించి పశువుల నుంచి సీరం నమూనాలను సేకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గేదెలు, తెల్లజాతి పశువులలో గాలి కుంటి వ్యాధి అధికంగా వస్తుందన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ శిరీష, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మాజీ మంత్రికి ఘన స్వాగతం



ఎర్రవల్లి: మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు సోమవారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మల్దకల్ మండలంలోని బిజ్వారంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఆంజనేయులుగౌడ్ లతో కలిసి వెళ్తుండగా బీచుపల్లి, ఎర్రవల్లి కూడలిలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేసి శాలువాలతో వారిని ఘనంగా సత్కరించారు. విజయ్‌కుమార్, కిశోర్, నారాయణనాయుడు, రాజు, రఘు, ఉన్నారు.

శివాలయంలో అభిషేకం



ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో కార్తీక మాసం మొదటి సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో శివాలయాన్ని దర్శించుకున్నారు. శివుడికి పంచామృత అభిషేకాలు నిర్వహించి ఆలయం ముందు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులను తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి వార్షిక పూజలు



అమరచింత: పట్టణంలో గతేడాది నవంబర్‌లో ప్రతిష్ఠించిన బొడ్రాళ్ల ఉత్సవం నేటితో ఏడాది కావడంతో వార్షిక పూజలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని 10 వార్డుల్లో ప్రతిష్ఠించిన బొడ్రాళ్ల వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించిన ఆయా కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో నైవేద్యాలను సమర్పించారు. పట్టణ నడిబొడ్డున నాభి శిల వద్ద భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చి పూజలు నిర్వహించారు. స్థానిక శివ చౌడేశ్వరి ఆలయం వద్ద వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య హోమం చేశారు. బీసీ కాలనీతో పాటు శివాజీనగర్, మహంకాళీ వీధిలో అన్నప్రసాద వితరణ చేశారు. పూజా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు మంగమ్మ, నాగభూషణంగౌడ్ పాల్గొన్నారు.

కురుమూర్తి జాతరలో వైద్యశిబిరం ఏర్పాటు

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి జాతరలో చిన్నచింతకుంట పీహెచ్‌సీ వైద్యుడు రాహుల్ వైద్య శిబిరాన్ని సోమవారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుమూర్తి స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఏదైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వారికి ప్రథమ చికిత్స అందిస్తామన్నారు. జాతరలో 4 వైద్య శిబిరాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు.